ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

విశాలాంధ్ర - నక్కపల్లి : మండలంలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నక్కపల్లి ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఐసిడిఎస్ కార్యాలయం నుంచి జాతీయ రహదారి మీదగా భారీ ర్యాలీ నిర్వహించారు అనంతరం స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు బాలికలు ఉజ్వల భవిష్యత్తులో భవిష్యత్తు కోసం బాలికలు శక్తివంతంగా ఎదగడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం వైసీపీ ఇంఛార్జిగా గుడివాడ అమర్నాథ్ బాధ్యతల స్వీకరణ

విశాలంధ్ర - చోడవరం : జనవరి 24, చోడవరం నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జిగా ఐ.టి, పరిశ్రమలు శాఖ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ శుక్రవారం వైసీపీ క్యాంపు కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు, అనకాపల్లి పార్లమెంటరీ ఇన్చార్జి కరణం ధర్మశ్రీలు, పార్టీ ముఖ్య నేతలు అమర్నాథ్ కు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు అధిష్టానం కొన్ని నిర్ణయాలు తీసుకుందని స్పష్టం చేశారు. పార్టీ ఆదేశానుసారం క్రమశిక్షణ గల కార్యకర్తగా వైసీపీ విజయానికి పని చేయాల్సిందిగా సూచించారు. ప్రభుత్వ మాజీ విప్, చోడవరం మాజీ ఎమ్మెల్యే, అనకాపల్లి పార్లమెంటరీ వైసిపి ఇన్చార్జి కరణం ధర్మ శ్రీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు ప్రక్షాళన మొదలైంది అన్నారు. తమపై పార్టీ అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అనకాపల్లి పార్లమెంటరీ పరిధిలో గల ఏడు నియోజకవర్గాల్లోను వైసీపీ విజయం సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు. తాను రాజకీయ ప్రవేశం చేసిన నాటి నుండి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి అడుగు జాడల్లోనే వున్నాను అని, మరో పార్టీ వైపు చూడలేదని తెలియజేశారు. అనంతరం చోడవరం నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ తనకు రాజకీయ భవిష్యత్తు అందించిన వైసిపి విజయానికి కృషి చేస్తానన్నారు వైసిపి నేతలకు కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి పార్టీ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకు వెళ్తామని అధినేతలకు స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి చోడవరం నియోజక వర్గం ప్రస్తావన వచ్చినప్పుడు అందరి ఆమోదంతో సామాజిక వర్గానికి చెందిన గుడివాడ అమర్నాథ్ అనే నా పేరును సూచించడం అదృష్టం అన్నారు. చోడవరం నియోజకవర్గంలో మరింత అభివృద్ధి బాట వేసేందుకు స్థానిక కార్యకర్తలు, నాయకులు జిల్లా అధ్యక్షులు పార్టీ ముఖ్య నేతలు సహకరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్, ఏ.ఎం.సీ మాజీ అధ్యక్షుడు ఏడువాక సత్యారావు, చోడవరం ఎంపీపీ గాడి కాశమ్మ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, ఓరుగంటి నెహ్రూ బాబు, దేవరపల్లి సత్య, పినబోయిన అప్పారావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు గీత కులాల వారికి లాటరీ ప్రక్రియ ద్వారా 15 మద్యం దుకాణాలకు ఎంపిక

విశాలాంధ్ర - అనకాపల్లి : కలెక్టరేట్ఃజిల్లాలో కల్లు గీత కులాల వారికి లాటరీ ప్రక్రియ ద్వార 15 మద్యం దుకాణాలు ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా ఎక్సైజ్ సూపరింటిడెంట్ వి. సుధీర్, జిల్లా కల్లు గీత ఉప కులాల నాయకుల అయిన శెట్టి బలిజ కులానికి చెందిన పిల్లి రాంబాబు, పాలిక వెంకన్న, యాత కులానికి చెందిన గుత్తుర్తి పాండురంగ, దుంగ అప్పలరాజు సమక్షంలో లాటరి ప్రక్రియ ద్వారా ఆయా యాత ఉప కులాలకు ఆయా మద్యం దుకాణలను లాటరి ప్రక్రియ ద్వార ఎంపిక చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా తొలుత జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ లాటరీ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-2026 సంవత్సరం కు సంబంధించి మద్యం షాపులకు గీత కులాల ఎంపికకు లాటరీ ద్వారా పారదర్శక కేటాయింపు ప్రక్రియను ప్రారంభించడం జరిగిందన్నారు. అనకాపల్లి జిల్లాకు సంబంధించి శెట్టిబలిజ, యాత, గౌడ్ మరియు గౌడ అనే 04 కల్లు గీత ఉప కులాలను గుర్తించి శెట్టిబలిజ వారికీ -9, యాత వారికీ-4, గౌడ వారికీ-1, గౌడ్ వారికీ -1, జిల్లాలో మొత్తంగా 15 మద్యం దుకాణాలు ఎంపిక చేయడం జరిగిందన్నారు లాటరీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే జిల్లా ప్రొబిహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి గజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని, దుకాణాలకు (ఆన్లైన్/ ఆఫ్లైన్ /హైబ్రిడ్ మోడ్) ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల నమోదు మరియు సమర్పణ ఉంటుందని అన్నారు. ఫిబ్రవరి 6వ తేదీన దరఖాస్తుల పరిశీలన లాటరీ కి సంబంధించిన సన్నాహాలు జరుగుతాయన్నారు. ఫిబ్రవరి 7వ తేదీన జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రక్రియ ద్వారా షాపుల కేటాయింపు జరుగుతుందని ఎంపికైన దరఖాస్తుదారులకు సమాచారం అందజేయడం జరుగుతుందన్నారు. మండలాల వారీగా కేటాయించిన మద్యం దుకాణాలు వివరాలు ,శెట్టిబలిజ కులాల వారికి -అనకాపల్లి రూరల్, నక్కపల్లి, నాతవరం, చీడికాడ, వి మాడుగుల, మునగపాక , కశింకోట, రాంబిల్లి, బుచ్చయ్యపేట,యాత కులాల వారికి -రోలుగుంట, పాయకరావుపేట, దేవరాపల్లి, రావికమతం, గౌడ కులాల వారికి మాకవరపాలెం, గౌడ్ కులాల వారికి-యలమంచిలి.

ఆకస్మికంగా పాఠశాలలను తనిఖీ చేసిన డీఈఓ

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలోని బంగారమ్మ పాలెం, రేవు పోలవరం, కొరుప్రోలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం బంగారమ్మ పాలెం గ్రామంలో మండల పరిషత్ ఉన్నత పాఠశాలను తెలియజేసిన సమయంలో తరగతి గదిలోని విద్యార్థుల తో మాట్లాడి పాఠ్యాంశాల సంబంధించి పలు ప్రశ్నలు వేయడం జరిగింది. అదే సమయంలో విద్యార్థుల నుంచి సరైన సమాధానాలు రాక పోవడం గమనించారు. దీనిపై ఆరా తీయగా పాఠ్యాంశాలు చెప్పే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే విద్యార్థులు వెనకబడుతున్నారని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మెమోలు జారీ చేయాలని డిప్యూటీ డీఈవో అప్పారావును ఆదేశించారు. మిగతా పాఠశాలలో తనిఖీ చేసిన సందర్భంలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

విశాలాంధ్ర - పరవాడ : పెద ముషిడి వాడ జడ్పీ హైస్కూల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2008లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. అప్పటి నుంచి ప్రతీ ఏడాది జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించడం జరుగు తుందన్నారు. దేశంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న విద్య, పోషకాహారం, బాల్య వివాహాలు, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, సామాజిక అభివృద్ధి , ఎదుగుదల వంటి అంశాలపై ఈ సందర్భంగా ఆమె ఆమె అవగాహన కల్పించి ప్రతి విషయంలో ఆడపిల్లలు వారి శక్తి సామర్ధ్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ ఎంఎం.ఎస్.కె, ఎంఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం ప్రారంభం

విశాలాంధ్ర - కశింకోట : మండలంలోని సోమవరం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని మాజీ మంత్రి, శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మరియు మాజీ శాసన సభ్యులు పీలా గోవింద సర్పంచ్ సత్యనారాయణ ,రాష్ట్ర తెలుగు అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు,శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పాడిని అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయిస్తూ ఆరోగ్య సంరక్షణను చూసుకుంటే పాలఉత్పత్తి పెరిగి ఆదాయం ఆర్జించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ,జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి రామ్మోహన్ రావు మాట్లాడుతూ పశు పోషకులకు ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందించడంతోపాటు పశుసంవర్ధక రంగాన్ని మరింత మెరుగుపరిచే క్రమంలో వివిధ నూతన పథకాలను ప్రవేశపెట్టి తోడ్పాటు ను అందిస్తుందన్నారు. అందులో భాగంగా గోకులం,బహు వార్షిక పశుగ్రాస క్షేత్రాలు,లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఆడపెయ్యలని పుట్టించడం, పిండ మార్పిడి విధానం, పశు బీమా, రాయితీపై ఇన్పుట్స్, పశు కిసాన్, సి ఏ డి డి ఎల్, ద్వారా వ్యాధి నిర్ధారణ సరైన వైద్యం అందుతుందని,క్రెడిట్ కార్డుల అనంతరం డాక్టర్ చైతన్యమని ఆరోగ్య శిబిరంలో 25 పశువులకు వైద్య పరీక్షలు,16 పశువులకు గర్భకోశ చికిత్సలు, 6 చూడి తనిఖీలు,64 ఆవులకు మరియు దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ బి సౌజన్య, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్ హోమ్ విందు కార్యక్రమానికి వెంకటలక్ష్మి ఎన్నిక

విశాలాంధ్ర - చీడికాడ : ప్రతి సంవత్సరం రాష్ట్ర రాజధానిలో ప్రభుత్వం నిర్వహించే స్వాతంత్ర్య రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో భాగంగా రాజ్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ ఎట్ హెూం అనే విందు కార్యక్రమనికి ఆహ్వానం అందినట్లు మంచాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి అన్నారు ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈకార్యక్రమనికి రాష్ట్ర మంత్రులు వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను ఆహ్వానించడం జరుగుతుందన్నారు ఈకార్యక్రమనికి ఆహ్వానం రావడం సంతోషంగా ఉందన్నారు పాఠశాల సిబ్బంది విద్యార్థులు తల్లితండ్రుల సహకారం అధికారుల ప్రోత్సాహం వల్లే ఇది సాధ్యమైందని ఆమె అన్నారు వారికి కృతజ్ఞతలు తెలిపారు డిఈఓ అప్పారానాయుడు మాట్లాడుతూ విద్యారంగంలో చేసిన కృషికి ఆమెను ఎంపిక చేయడం జరిగిందన్నారు.

205 కేజీల గంజాయి స్వాధీనం..ముగ్గురు నిందితులు అరెస్ట్

విశాలాంధ్ర - అనకాపల్లి : నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 205 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పి తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.నర్సీపట్నం రూరల్ పోలీసులకు శుక్రవారం వచ్చిన సంవత్సరం మేరకు సి.ఐ ఎల్.రేవతమ్మ, నర్సీపట్నం ఎస్.ఐ పి.రాజారావు, గొలుగొండ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ ఎం.రామారావు, సిబ్బంది మధ్యవర్తుల సమక్షములో నర్సీపట్నం శివారు నెల్లిమెట్ట సాధుపాకలు వద్ద వాహన తనిఖీ చేయుచుండగా టీవీ-9 స్టిక్కర్ ఉన్న కియా కారు నెంబర్. ఏపీ39 5657, మరియు యమహా మోటార్ సైకిల్ నెంబర్ ఏపీ39 0806 చింతపల్లి వైపు నుండి నర్సీపట్నం వైపు వస్తుండగా, పోలీస్ సిబ్బంది సదరు రెండు వాహనాలను ఆపగా, రెండు వాహనాలలోని నిందితులు రెండు వాహనములును రోడ్డు ప్రక్కన ఉన్న పొదలలో ఆపి పారిపోవుచుండగా పోలీస్ సిబ్బంది పి.సి. వి.సుబ్బారావు, పి.సి. ఎం.బాబ్జీ, పి.సి. కె.చిన్నారావు సదరు వ్యక్తులను పట్టుకొని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కారును తనిఖీ చేయగా అందులో 205 కె.జి ల గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. నిందితులుఅజిత్ తంగరాజన్, అమల్ సురేష్లు తమిళనాడు వెళ్లి అక్కడ తన స్నేహితుడితో మాట్లాడుకొని గంజాయి కొని తేవడానికి జూమ్ కార్ హెూస్ట్ ఆప్ లో కియా కారు టూరిజం పేరు మీద 10 రోజులకు అద్దెకు తీసుకొని, కారు ఒరిజినల్ నెంబర్ టీఎన్ 05 సీఎం 0165 ను తొలగించి, అక్కడే తన స్నేహితుడు ఫేక్ కారు నెంబర్ ఏపీ39 ఎస్ యు 5657 బోర్డును కారుకు తగిలించి, టీవీ-9 స్టిక్కర్ ను తయారు చేసికొని ఒక చిన్న బాగ్ లో స్టిక్కర్ లు పట్టుకొని ఈనెల 16 న తమిళనాడు నుండి కారులో బయలుదేరి 18 రాత్రి కి అల్లూరి సీతారామరాజు జిల్లా, పెదబయలు చేరుకొని మర్రి సత్తిబాబు అతని స్నేహితుడిని కలిసి రెండు రోజులు ఏజెన్సీ ప్రాంతం అంతా తిరిగి, మర్రి సత్తిబాబు అతని స్నేహితుడు కలిసి 205 కె.జి. ల గంజాయిని ఒడిస్సా పరిసర ప్రాంతములో సేకరించి ఒక్కొక్క కె.జి. 5,000/- రూపాయలు చొప్పున 10,25,000/- రూపాయలకు అజిత్ తంగరాజన్ అమ్మినట్లు తెలిపారు. మర్రి సత్తిబాబు అకౌంట్ కి రూ.49,000/- పంపి, నగదు రూ.78,000/-లు మర్రి సత్తిబాబు అతని స్నేహితుడుకు ఇచ్చారని తెలిపారు. మిగిలిన సొమ్ము గంజాయి కేరళ చేరుకున్న తరువాత తిరిగి చెల్లించడానికి మాటలు ఆడుకున్నారు. ఇంతకు ముందు కూడా రెండు సార్లు ఇదే తరహాలో గంజాయి కేరళ తీసుకెళ్ళి, అక్కడ నుండి మిగిలిన సొమ్ము పంపించినట్లు తెలిపారు.ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుల గురించి దర్యాప్తు బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. కేసులో సమాచారం సేకరించి గంజాయి పట్టుకున్న సిబ్బందిని నర్సీపట్నం సబ్ డివిజన్ డి.ఎస్.పి. శ్రీ పోతురెడ్డి శ్రీనివాసరావు, నర్సీపట్నం రూరల్ సి.ఐ. శ్రీమతి ఎల్.రేవతమ్మ, నర్సీపట్నం రూరల్ ఎస్.ఐ.రాజారావు, గొలుగొండ ఎస్.ఐ.రామరావు మరియు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర - నాతవరం : అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అల్లాడ సురేష్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. శుక్రవారం నాతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు అల్లాడ సురేష్ జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ సూర్యచంద్ర ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఈ చారిటబుల్ ట్రస్ట్ నందు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు సూర్యచంద్ర, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి, టిడిపి యువ నాయకులు వెలగా వెంకటకృష్ణారావు, నాతవరం జనసేన అధ్యక్షులు వెలగల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మంచి గుర్తింపు

విశాలాంధ్ర - గొలుగొండ : గొలుగొండ మండలం జోగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బాలికలకు వివిధ రకాల రకాల ఆటలపోటీలను నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బి. సుబ్బారావు మాట్లాడుతూ బాలికలు ఉన్నత స్థితిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహించాలని, అలాగే తల్లి కడుపులో ఉన్నప్పుడే బాలిక అని తెలిసి చంపేస్తున్నారని, అవి జరగకుండా తల్లిదండ్రులు బాలికలపై అవగాహన పెంచుకోవాలన్నారు.అలాగే ఈ కార్యమాన్ని ఉద్దేశించి ఉపాధ్యాయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

హోం మంత్రి అనితను కలిసిన ప్రగడ

విశాలంధ్ర - అచ్యుతాపురం : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనితను వారి నివాసంలో శుక్రవారం రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

కుసర్లపూడిలో శ్మశాన వాటిక భూమిపై సర్వే

విశాలాంధ్ర - రోలుగుంట : రోలుగుంట మండలం కుసర్లపూడి గ్రామంలో శ్మశాన వాటిక భూమిపై రెవెన్యూ అధికారులు శుక్రవారం సర్వే ప్రారంభించారు. స్థానిక రైతులు కొంత మంది 230 సర్వే నెంబరులో 70 సెంట్లు శ్మశాన వాటిక భూమిలో కొంత భాగం ఆక్రమించారని మండల బీజేపీ మండల అధ్యక్షుడు పచ్చిగోళ్ళ ఈశ్వరరావు గత సంవత్సరం డిసెంబర్ ఆరో తేదీన జరిగిన రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. మండల సర్వేయర్ ఆర్తి నాయుడు, గ్రామ సర్వేయరు మహేష్, వీఆర్ఓ రామచంద్రులు సంబంధిత భూమిలో సర్వే నిర్వహించారు.

పాకలపాడులో పశువుల గర్భకోస వ్యాధులకు చికిత్సలు

అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

విశాలాంధ్ర - గొలుగొండ : మండలం లో పాకాలపాడు గ్రామంలో పశువులు గర్భకోస వ్యాధులకు చికిత్సలు, పశురోగ్య శిభిరం నిర్వహించటం నిర్వహించారుఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డబ్ల్యూ రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భకో సంవ్యాధుల రాకుండా చూసుకోవాలని, యదకి రాణి పశువులను సకాలంలో వైద్యం చేయించాలని, కృత్రిమ గర్భధారణ చేసిన పశువులకు 3 నెలల్లో గర్భనిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని, అన్నారు అలానే పాములమందులు మేకలకు గొర్రెలకు తగు మొతాధుల్లో పట్టించాలని, కాలానికి అనుగుణంగా టీకాలు అన్నిపశువుల్లోను కోళ్లుతో సహా వేయించాలన్నారు. ప్రభుత్వం గడ్డి పెంచుకునే అవకాశం పైసా ఖర్చు లేకుండా కల్పించటం జరిగిందిని ప్రజలు అందరూ ఆవథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంతేకాకుండా భవిష్యత్లో టిఎన్ఆర్, చాఫ్ కట్టర్స్, సైలేజ్,పశుభీమా వంటివి రైతులకు రాయితీలమీద అందుబాటుకు వస్తాయని తెలియజేసారు ఈ కార్యక్రమం లో 20 పశువులకు సూళ్లు నిర్ధారణ మరియు 22 పశువులకు గర్భకోసవ్యాధి పశువులకు చికిత్స చేయటం జరిగింది 15 లేగ దూడలకు 50 గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయటం జరిగింది ఈ కార్యక్రమం లో పశువైద్యధికారులు డాక్టర్ లోకుల రమేష్, డాక్టర్ శిరీష, పాకాలపాడు పాలఉత్పత్తి సంఘం ప్రెసిడెంట్స్ రుత్తల సత్తిబాబు, రుత్తల బంగ్రరాజు పాల్గొన్నారు.

కోటి రూపాయలతో సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే కొణతాల

విశాలాంధ్ర - కశింకోట : మండలంలోని సోమవరం గ్రామంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన యన్ఆర్జిఈఎస్, పంచాయతీ రాజ్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభిచాడానికి ముఖ్య అతిధులు గా మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ. మాజీ శాసనసభ్యులు. అనకాపల్లి తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ విచ్చేసి వారి చేతుల మీదగా శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సోమవరం నుండి ఏనుగుతుని కి వెళ్లే రోడ్డు సోమవరం నుండి గణపర్తి కు వెళ్లే రోడ్డు కు 1 కోటి రూపాయలు తో పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ, నర్సాపురం డ్యాం గేట్లు రిపేర్ కు, త్వరలో నిధులు మంజూరు చేయిస్తామన్నారు. అలాగే ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు అందరూ ఉపయోగించుకోవాలని తెలియజేశారు .ఈ కార్యక్రమం లో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ,సినీ డైరెక్టర్ భీమరశెట్టి చిన్నికృష్ణ, గ్రామ సర్పంచ్ గొంతిన నాగరత్నం ,గొంతిన చిన్నానాయుడు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, కలగా సోమేశ్వరరావు ,ఎన్టీఆర్ హాస్పటల్ డైరెక్టర్ ఉల్లింగల రమేష్, కర్రి సత్యనారాయణ , ఎంపీటీసీలు సర్పంచ్లు మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచ్లు వీర మహిళలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

వీఆర్వోల సమస్యలపై నిరంతరం పోరాటం

విశాలాంధ్ర - యస్. రాయవరం : రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని వీఆర్వోల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామ్మూర్తి అన్నారు. శుక్రవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఓ అనకాపల్లి జిల్లా విఆర్వోల సంఘం ఆధ్వర్యంలో మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేస్తామని అన్నారు. అదేవిధంగా ప్రస్తుతం గ్రామాల్లో ప్రారంభమైన భూమి రీ సర్వే సమయంలోనే వీఆర్వోలపై ఒత్తిడి తగ్గించాలని కోరారు. ఇటీవల విడుదల చేసిన డైరీ క్యాలెండర్ను వీఆర్వోలకు అందజేశారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ నీరజాకు డైరీ క్యాలెండర్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షులు టి.రాంకాసు కార్యదర్శి అనంతరామయ్య, డివిజన్ కార్యదర్శి శశిధర్, సహాయ కార్యదర్శి అప్పారావు, ఎస్.రాయవరం మండలం సంఘం అధ్యక్షులు ఆర్.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఒత్తిడి గురిచేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : విద్యార్థి ఫెడరేషన్

విశాలాంధ్ర - అనకాపల్లి : రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడి తత్వాన్ని ప్రదర్శిస్తూ విద్యార్థులపై ఫీజులు చెల్లించాలని తీవ్రమైన వేధింపులు గురిచేస్తున్నాయని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాలాజీ ఎం.రమణ మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రాష్ట్రంలో పరీక్షలు దగ్గర వస్తున్న నేపథ్యంలో కార్పొరేట్ చైతన్య, నారాయణ కళాశాలలో విద్యార్థులను ఫీజులు చెల్లించాలని తీవ్రమైన వేధింపులకి గురిచేస్తున్నారని అన్నారు. ఈ మధ్య కాలంలోనే విజయవాడ చైతన్య గోశాల క్యాంపస్ లో సంక్రాంతి సెలవులకు వెళ్ళి తిరిగి కళాశాలకు వచ్చిన విద్యార్థి ఫీజు కడితేనే లోపలికి అనుమతిస్తామని యాజమాన్యం చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో అర్ధరాత్రి విద్యార్థి, తండ్రి ఇద్దరు కలిసి కళాశాల బయట నిరసన తెలియజేయడంతో అనుమతించారని అన్నారు. గురువారం అనంతపురం నారాయణ కళాశాలలో ఫీజు చెల్లించలేదని గంటల తరబడి విద్యార్థిని నిలబెట్టడంతో విద్యార్థి మనస్తాపానికి గురయ్యి అక్కడికక్కడే మూడవ అంతస్తు నుండి దూకి మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కార్పొరేటు విద్యాసంస్థలను విచ్చలవిడి దోపిడీని అదుపుచేయడంలో విఫలం అయిందని అన్నారు. విద్యాశాఖ మంత్రి ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్నారని వాపోయారు. ఎన్నికలు ముందు పవన్ కళ్యాణ్ కార్పొరేటు విద్యా సంస్థల్లో విద్యార్థులు చనిపోతున్నారని మాట్లాడిన విషయాన్నీ గుర్తుచేశారు. అలాంటి వాటిపై చర్యలు తీసుకుంటామని చెప్పిన మాటలు గుర్తెరగాలని కోరారు. ఇంటర్ బోర్డు పూర్తిగా కార్పొరేటు కళాశాలకు అమ్ముడుబోయిందని ఇప్పటి వరకూ ఈ సంఘటనలపై ఎందుకు ఇంటర్ బోర్డు కమీషనర్ మౌనం ప్రదర్శిస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే విద్యా శాఖ, ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ రెండు ఘటనలు కారకులైన చైతన్య, నారాయణ కళాశాలల క్యాంపస్ లను సీజ్ చేసే, యాజమాన్యంపై క్రిమినల్ కేసు బానాయించాలని వారు డిమాండ్ చేశారు. మరణించిన విద్యార్థికి న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో కార్పొరేట్ కళాశాలలో విద్యార్థుల పైన ఎటువంటి ఫీజుల విషయంలో ఎటువంటి ఒత్తిడి లేకుండ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

దేవిపురంలో ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

విశాలాంధ్ర - సబ్బవరం : మండలంలోని దేవిపురం శ్రీ సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి అమ్మవారి పీఠంలో జాతీయ బాలికా దినోత్సవం ను పురస్కరించుకొని శుక్రవారం బాలికా దినోత్సవ వేడు కలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు శ్రీ విద్యా ట్రస్ట్ కార్యదర్శి కందర్ప రమ, దేవిపురం నిర్వాహకులు ప్రభాకర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలను చిన్నతనం నుండి సరైన పెంపకంతో పాటు విద్య, వైద్యం కల్పిస్తే అన్ని రంగాలలో రాణిస్తారని తెలిపారు. అలాగే మన దేశానికి బావి భారత పౌరులుగా, శాస్త్ర వేత్తలుగా, దేశ రక్షకలుగా, క్రీకారులుగా, ఇంజనీర్లుగా, వైద్యులుగా అనేక రంగాలలో రాణిస్తారని స్పష్టం చేశారు. అందుకోసం మనమంతా బాలికలకు విద్యా హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే బాలికలకు విద్య వైద్యం ఆరోగ్యంపై అవగాహన కల్పించవలసిన అవసరం ఉందని అన్నారు. దేవిపురంలో గురు పరంపర అమృత కన్యా గురుకులం ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం 15 మంది బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురు మాత అన్నపూర్ణమ్మ చిన్నారులను దీవించి బహుమతులను అందజేశారు.

రహదారులపై ట్రాఫిక్ రూల్స్ పాటించాలి : ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ

విశాలాంధ్ర - యలమంచిలి : యలమంచిలి ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో పట్టణంలో భాష్యం స్కూల్ లో ఆటో డ్రైవర్లకు, బస్సు డ్రైవర్లకు ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ఆటోలు, స్కూల్ బస్సులు దిగేటప్పుడు మరియు ఎక్కేటప్పుడు స్కూల్ పిల్లలపై జాగ్రత్తగా ఉండాలని అన్నారు. డ్రైవర్లు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ తోటి వారికి సహకరించాలని అందరూ భద్రతను పాటిస్తే ప్రమాదాల నివారణ చేయొచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పాల్గొన్నారు.